ప్రజాశక్తి

శనివారం 11 ఫిబ్రవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మా పని మాదే..!

◆ అంతులేని 'అధికార' దుర్వినియోగం
◆ పట్టభద్రుల ఎన్నికలకు అప్రతిష్ట
◆ శాఖా పరమైన సమావేశమని పిలిచి ఎన్నికల ప్రచారం
◆ కళ్లు మూసుకున్న అధికార యంత్రాంగం



సమావేశంలో పాల్గొన్న కెజిబివి సిబ్బంది (ఫైల్‌ఫొటో)



కెజిబివి సిబ్బంది సమావేశంలో సుధాకర్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డమే కాదు.. ప్రభుత్వ అధికారులపై ఒత్తిడితెచ్చి అధికారిక సమావేశాల పేరిట ఉద్యోగులను సమీకరించి అధికార పార్టీ ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు అధికార యంత్రాంగం విద్యార్హతలేని ఓటర్లను, రెండు, మూడు సార్లు నమోదైన ఓటర్లను జాబితా నుంచి ఇప్పటికీ తొలగించలేదు. పోలింగ్ బూత్‌కు సమీపంలో ఓటర్లుండేలా సర్దుబాటు చేయలేదు. పేర్లు, చిరునామా, డోర్ నెంబర్లలో దొర్లిన తప్పులనూ సరిచేయలేదు. 2019 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పాసైన పట్టభద్రులు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవాల్సివుండగా వాలంటీర్లను ఉపయోగించుకొని చదువుకోనివారిని, ఐదు, పది, ఇంటర్, డిప్లొమో, జిఎన్ఎం, ఐటిఐ, పియుసి చదివిన వారిని ఓటర్లుగా నమోదుచేసి ప్రభు భక్తిని అధికారులు చాటుకున్నారు. అధికార పార్టీ అభ్యర్థి సుధాకర్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేలు చేకూర్చేందుకు నిబంధనలకు విరుద్ధమైన పనులన్నీ అధికారులతో ప్రభుత్వం చేయిస్తోంది. అధికార పార్టీకి అమ్ముడుపోయిన, ప్రలోభాలకు లొంగి పోయిన కొంతమందిని ఉపయోగించి శాఖాపరమైన సమావేశాలని చెప్పి పరిచయ కార్యక్రమాలను వైసిపి అభ్యర్థి నిర్వహిస్తున్నారు. ఈ తరహా పొరపాట్లు జరగకుండా చూడాల్సిన అధికారులే పరోక్షంగా సహకరించడంతో అధికార పార్టీ నాయకులు ఉద్యోగులను ప్రలోభపెట్టడం, జీతాలు పెరుగుతాయంటూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆశలు కల్పించడం, ఈ రెండింటికీ అవకాశంలేనిచోట ఉద్యోగులను అక్కడక్కడా భయపెట్టడం వంటివి చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రతిష్టకు మచ్చతెచ్చేలా అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారు. విశాఖ నగరంలో ఆదివారం మిగతా 2లో..



ధర్నాలో మాట్లాడుతున్న పద్మనాభరాజు

పోర్టు ఆస్తుల ప్రైవేటుపరంపై ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ పోర్టు ఆస్తులు, ఆసుపత్రి, కల్యాణ మండపాలు, స్టేడియం తదితరాలను మౌలిక సదుపాయాల కల్పన ముసుగులో ప్రైవేటువారికి కట్టబెట్టాలన్న యాజమాన్య చర్యలను ఖండిస్తూ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సీహార్స్ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) గౌరవ అధ్యక్షులు జెవి.సత్యనారాయణమూర్తి, విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి విఎస్.పద్మనాభరాజు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విశాఖలో పరిశ్రమలకే తలమానికంగా ఉన్న విశాఖపట్నం పోర్ట్ ట్రస్టు స్థలాలను, స్టేడియం, కల్యాణ మండపాలను ప్రైవేటువారికి కట్టబెట్టాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చరాదన్నారు. కార్మికులకు పెండింగ్ బోనస్ ఇవ్వాలని, కొత్త బోనస్ ఫార్ములా, ఏ షరతులూ లేని వేతన ఒప్పందం వెంటనే చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. న్యూ స్టీవ్ డోరింగ్ పాలసీని అమలు చేయరాదన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. మేజర్ పోర్టు ట్రస్ట్ యాక్ట్ 1963 స్థానంలో మేజర్ పోర్టుల అథారిటీ యాక్ట్- 2021 నవంబర్ మూడున అమల్లోకి వచ్చిందని, దీంతో పోర్టులకు చట్టపరమైన రక్షణ నిర్వీర్యమైపోయిందని మిగతా 2లో..

డిసిఐ అత్యధిక టర్నోవర్ రూ.372.30 కోట్లు

▶ వార్త మెయిన్‌లో..

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

▶ వార్త 2లో..

టార్గెట్‌బాల్ విజేత ఆంధ్ర యూనివర్సిటీ

▶ వార్త 3లో..



అవార్డు స్వీకరిస్తున్న స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగి

స్టీల్‌ప్లాంట్ ప్రోత్సాహం భేష్

మహిళల అభివృద్ధిలో జాతీయ స్థాయి అవార్డు కైవశం

వార్త మెయిన్‌లో..

నెత్తురోడిన రోడ్లు

◆ వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం ◆ అందులో ముగ్గురు యువకులు
◆ఎండాడలో విషాద ఛాయలు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. అందులో ముగ్గురు యువకులు ఉన్నారు. వీరు విశాఖలోని ఎండాడ ప్రాంతానికి చెందిన వారు కావడంతో అక్కడ విషాద ఛాయలు అలుముకున్నాయి.





రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎండాడకు చెందిన యువకులు సాయి, దుర్గాప్రసాద్, గోపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, మధురవాడ

విశాఖ నగరంలోని వెంకోజీపాలెం జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజాము సుమారు 1:30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరు ఎండాడ ప్రాంతానికి చెందినవారు. మోటారు బైకుపై అత్యంత వేగంగా ప్రయాణిస్తుండగా బైకు అదుపు తప్పి పల్టీలు కొట్టి తలలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్టు పలువురు భావిస్తున్నారు. వెంకోజీపాలెం వద్ద చెల్లాచెదురుగా పడి ఉన్న వీరి మృతదేహాలను చూసి అటుగా వెళ్లే వాహనదారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు విచారణ చేపట్టారు. ప్రమాదంలో ఎండాడకు చెందిన సాయి (21), దుర్గాప్రసాద్ (21), గోపి (22) మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ ముగ్గురు యువకులు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మా పని మాదే..!

ఓ హోటల్‌లో శాఖాపరమైన సమావేశముందని కెజిబివి బోధన, బోధనేతర సిబ్బందిని పిలిపించి, వైసిపి అభ్యర్థి సుధాకర్‌ను పరిచయడం చేయడం ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. కెజిబివి బోధన, బోధనేతర సిబ్బందికి పరిచయం చేసినతీరు విమర్శలకు దారితీయడంతో కొత్త పల్లవి అందుకున్నారు. కెజిబివిలకు హాట్ వాటర్ సోలార్ సిస్టమ్ ఇస్తామని చెప్పడానికి సుధాకర్ వచ్చాడని చెప్పుకొస్తున్నారు. ఇంతవరకు గుర్తుకురాని కెజిబివి పిల్లలు ఇప్పుడు సుధాకర్‌కు గుర్తుకొచ్చారా ? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హాట్ వాటర్ సోలార్ సిస్టమ్ ఇస్తామని హామీ ఇచ్చిన సుధాకర్.. 23 కెజిబివిలకు ఎప్పుడు ఇస్తానన్నది మాత్రం చెప్పకపోవడంలోనే ఆయన అసలు నైజం అర్థమవుతోంది. ఓరియంటేషన్ ప్రోగ్రాం పేర సిబ్బందిని రప్పించి, సుధాకర్‌ను పరిచయం చేయడం విమర్శలకు దారితీయడంతో హాట్ వాటర్ సోలార్ సిస్టమ్ ఇస్తున్నట్లు చెప్పడానికి ఆయన వచ్చినట్లు అధికారులు సమర్థించుకుంటున్నారు.

నెత్తురోడిన రోడ్లు

బైకు అదుపు తప్పడం వల్ల మృతి చెందారా ? లేక ఏదైనా భారీ వాహనం వెనుక నుంచి ఢీకొనడం వల్ల చనిపోయారా ? అన్నది తేలాల్సి ఉంది.

అందికొచ్చిన సమయంలో..

అంది వచ్చిన కొడుకులు విగత జీవులై కానరావడంతో ఎండాడ రాజీవ్ నగర్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఉన్న దిక్కును కోల్పోయిన రామయ్యమ్మ తన కొడుకు సాయితో రాజీవ్ నగర్ కొండపై నివాసం ఉంటోంది. సాయి పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఖాళీగా ఉంటున్నాడు. భర్త లేకపోవడంతో రామయ్యమ్మ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఉన్న ఒక్కగాని ఒక కొడుకు మృతి చెందడంతో ఆ తల్లి నాకు దిక్కెవ్వరు అంటూ విలపించడం పలువురిని కలచివేసింది. రంగుల శ్రీనివాసరావు భార్యా పిల్లలతో నగరం నుంచి ఎండాడ రాజీవ్ నగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. వీరికి బాబు గోపి, పాప ఉన్నారు. స్థానికంగా టిఫిన్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గోపి పదో తరగతి వరకు చదివి తండ్రికి సాయం అందిస్తున్నాడు. శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు.

లారీ డ్రైవర్, క్లీనర్ దుర్మరణం

సబ్బవరం : మండలంలోని సబ్బవరం-అనకాపల్లి రోడ్డులో అసకపల్లి మలుపు వద్ద గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ దుర్మరణం చెందారు. లారీ ఢీకొన్న కారులో ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... అనకాపల్లి నుంచి పెందుర్తి వైపు వెళ్తున్న లారీ అసకపల్లి మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. అనంతరం లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న హైవే డివైడర్లు ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ రాజు, క్లీనరు గోపాల్ సర్దార్ అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక సిఐ రంగనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోర్టు ఆస్తుల ప్రైవేటుపరంపై ధర్నా

తెలిపారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పటల్ 38 సంవత్సరాలుగా వేలాది మంది కార్మికులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు వైద్యాన్ని అందిస్తోందన్నారు. అటువంటి ఆసుపత్రిని క్రిసిల్ రిమ్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్స్ లిమిటెడ్ (ముంబయి) అనే ప్రైవేట్ కంపెనీకి పిపిపి పద్ధతిలో కట్టబెట్టాలని నిర్ణయం చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ హాస్పిటల్ నుంచి పలు విభాగాలకు చెందిన సుమారు 16 వేల మంది, వారి కుటుంబ సభ్యులు వెరసి 40 వేల మంది వైద్యం పొందుతున్నారని చెప్పారు. ఈ హాస్పిటల్‌ను ప్రైవేట్‌పరం చేయకుండా సొంత నిధులతో అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు. విశాఖ పోర్టులో 26 బెర్తులకుగాను 8 బెర్తులను ఇప్పటికే ప్రైవేట్‌పరం చేశారన్నారు. విశాఖ పోర్టుకే గుండెకాయ వంటి ఒహెచ్‌పిను ఎస్సార్ కంపెనీకి కట్టబెట్టారని తెలిపారు. విసిటిపిఎల్ ప్రైవేట్ ఫలితంగా వచ్చిన అనర్థాలను గుర్తించినట్టు తెలిపారు. గతంలో పిపిపి మోడల్ వల్ల పోర్టుకు నష్టం జరిగిందని కంట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) నివేదిక తెలియజేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేట్ వారికి లాభాలు తేవడం కోసం దేశాన్ని నాశనం చేస్తోందని విమర్శించారు. ఎన్ఎంపి పేరుతో పోర్టు బెర్తుల ప్రైవేటీకరణ ఆపాలని, సిహెచ్ డి క్యాజువల్, పూల్, పోర్టు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, త్రినాధరావు, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్, చౌదరి అప్పారావు, హెచ్ఎంఎస్ నాయకులు డికె.శర్మ, మంగినాయుడు, సిఎఫ్‌టియుఐ నాయకులు ఎన్.కనకారావు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభ మద్దతు

పోర్టు సీహార్స్ జంక్షన్ వద్ద అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరుగుతున్న సంగతి తెలిసి ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అక్కడికి వచ్చి మద్దతు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్‌ల్లోని సిఐటియు నేతలు కూడా మద్దతు ప్రకటించారు.

ప్రజా ఉద్యమంగా 'ఉక్కు' పోరాటం

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సాగుతున్న పోరాటాలకు ప్రజా సంఘాలు, నిర్వాసితులు, ప్రజలు ఎనలేని మద్దతు ఇస్తున్నారని, ప్రస్తుతం ఈ పోరాటం ప్రజా ఉద్యమంగా మారుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు జె.రామకృష్ణ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 729వ రోజుకు చేరుకున్నాయి.

దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్-2 విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అప్పగిస్తోందని, ఇది దేశానికి అత్యంత ప్రమాదమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల మనుగడ అవసరమని కేంద్రం గుర్తించాలన్నారు. ఇప్పటికైనా తన నిర్ణయాన్ని మార్చుకుని సొంత గనులు కేటాయించాలని కోరారు. ప్రైవేటీకరణపై మొండిగా ముందుకెళ్తే ఉక్కు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఆదినారాయణ

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్

వివిధ రాష్ట్రాలకు చెందిన పట్టు, ఫ్యాన్సీ, జరీ చీరలతో పాటు వివిధ హస్త కళాఖండాలను ప్రదర్శిస్తూ చేపట్టిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోను గ్రామీణ హస్తకళా సంస్థ కార్యదర్శి జయేష్ కుమార్ గుప్తా, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ఆర్టిస్ట్ డైరెక్టర్ సన్ మూర్తి కలిసి శుక్రవారం ప్రారంభించారు. బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో ఈ ప్రదర్శన 14వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు ఈ సందర్భంగా తెలిపారు. చేనేత హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు హస్త కళా నైపుణ్యానికి తగిన ప్రాధాన్యతనిస్తూ ఈ తరహా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనేక కళాఖండాలు, చేనేత వస్త్రాలను బీహార్, అస్సాం, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, తెలంగాణ, జమ్ము కాశ్మీర్, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు చెందిన కళాకారులు స్టాల్స్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ ప్రదర్శన సందర్శన ఉచితమని, విశాఖను సందర్శించే అనేకమంది పర్యాటకులను ఆకర్షించే రీతిలో ఎక్స్‌పో ఉంటుందని అన్నారు.

కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఎం.సతీష్ కుమార్, జితిన్ కుమార్ త్యాగి, కుమారి మధు, విజయ, కృష్ణవేణి పాల్గొని ప్రదర్శనలో ఉంచిన వివిధ కళారూపాలకు సంబంధించిన సమాచారాన్ని వివరించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నిరంజన్ రెడ్డి

ఆర్ఎఫ్‌ఒగా నిరంజన్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖపట్నం జోన్ రీజనల్ ఫైర్ ఆఫీసర్‌గా డి.నిరంజన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నగరంలోని జగదాంబ ప్రాంతంలోని రీజనల్ కార్యాలయంలో ఆయనకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. గతంలో రాష్ట్రంలో రెండు రీజనల్ ఫైర్ కేంద్రాలుండగా తాజాగా ప్రభుత్వం నాలుగు జోన్లను ఏర్పాటు చేసింది. తిరుపతి, విజయవాడ, రాజమండ్రి, విశాఖల్లో రీజనల్ ఫైర్ ఆఫీస్(ఆర్ఎఫ్ఒ)లు నడుస్తున్నాయి. విశాఖ కేంద్రానికి ఆర్ఎఫ్‌ఒగా నిరంజన్ రెడ్డి నియమితులయ్యారు.

విద్యా తరంగిణి హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా వినూత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యాభవన్ భవన్‌ను విద్యార్థినుల హాస్టల్‌గా మార్పు చేసి విద్యా తరంగిణి హాస్టల్‌గా మార్పు చేసిన విషయం తెలిసిందే. ఈ హాస్టల్ ఇన్‌ఛార్జి చీఫ్ వార్డెన్‌గా ఎయు అప్లయిడ్ మేథమేటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వినూత నియమితులయ్యారు. ఎయు వీసీ ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు నుంచి ఈ మేరకు ఆమె ఉత్తర్వులు అందుకున్నారు.

శ్రీశైలం బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం నుంచి శ్రీశైలం వెళ్లి శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ఎపిఎస్ ఆర్‌టిసి నూతన సూపర్ లగ్జరీ సర్వీసును ప్రారంభిస్తున్నట్టు విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలరాజు శుక్రవారం తెలిపారు. ఈ నూతన సర్వీసు ప్రతిరోజూ సాయంత్రం 5:15 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి బయలుదేరుతుందని వెల్లడించారు. ఈ శ్రీశైలం సూపర్ లగ్జరీ బస్సులో ముందస్తుగా టికెట్ రిజర్వేషన్‌తో పాటు శ్రీశైలం ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్రదర్శనం టికెట్లు కూడా పొందవచ్చునని తెలిపారు.

దిశా పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీతారాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జి.సీతారాం శుక్రవారం దిశా పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. బాలల సంరక్షణపై తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో దిశా ఎసిపి సిహెచ్.వివేకానంద, దిశా ఎస్ఐలు, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

జి 20 సదస్సుతోనైనా..

భీమిలి రూపురేఖలు మారేనా?

ప్రచారం ఎక్కువ - నిధులు తక్కువ

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఎంతో చారిత్రక నేపథ్యం, సహజ సిద్ధమైన అందాలు సంతరించుకున్న పర్యాటక ప్రాంతం భీమిలి. పాలకుల నిర్లక్ష్యం కారణంగా దీని అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉంది. మార్చి 3, 4 తేదీల్లో విశాఖ కేంద్రంగా గ్లోబల్



బుద్ధుని విగ్రహం చుట్టూ తుప్పపట్టి, విరిగిన గ్రిల్స్

ఇన్వెస్టర్స్ సదస్సు జరుగనుంది. అదే నెల 28, 29 తేదీల్లో జి -20 సన్నాహక సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రపంచ దేశాల ప్రతినిధులు నగరానికి రానున్న నేపథ్యంలో నగరాన్ని అద్భుతంగా తీర్చి దిద్దేందుకు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. మొత్తం రూ.135 కోట్లతో మహా విశాఖ నగరాన్ని అత్యంత సుందరంగా ముస్తాబు చేయనున్నారు.

నిధులు కేటాయింపుపై పెదవి విరుపు

పర్యాటక రంగ అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ, ఎందుకనో భీమిలి ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. జి -20 సన్నాహక సదస్సు జరుగుతున్న క్రమంలోనైనా భీమిలి బీచ్ అభివృద్ధి జరుగుతుందని స్థానికులు ఆశిస్తున్నారు. పొట్టిశ్రీరాములు పార్కులో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పలు ఇనుప పరికరాలు, జారుడు బల్లలు తదితరాలు తుప్పపట్టి ఉన్నాయి. బుద్ధుని విగ్రహం చుట్టూ ఏర్పాటుచేసిన గ్రిల్ నేలకు ఒరిగింది. వీటిని సరిచేయాలి. ఐ లవ్ భీమిలి సింబల్‌ను పూర్తి స్థాయిలో



పొట్టి శ్రీరాములు పార్కులో తుప్పపట్టిన పరికరాలు

చెక్కాలి. పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ, చిల్డ్రన్స్ పార్కుల్లో పచ్చదనం నిండేలా సుందరంగా తీర్చిదిద్దాలి. పర్యాటకులు, సందర్శకులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉండేలా చర్యలు చేపట్టాలి. ఇలా ఉండగా జి - 20 సదస్సు నేపథ్యంలో బీచ్ అభివృద్ధికి జివిఎంసి కేవలం రూ.2.71 కోట్లు కేటాయించడంపై పలువురు పెదవివిరుస్తున్నారు.

నేరాలు ఘోరాలు

అదానీ గంగవరం పోర్టులో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- గాజువాక : అదానీ గంగవరం పోర్టులో శుక్రవారం భారీ ట్రక్ ఢీకొని జి.సత్యారావు (56) దుర్మరణం చెందాడు. సిద్దేశ్వరం ప్రాంతానికి చెందిన సత్యారావు గంగవరం పోర్టులో గత కొంతకాలంగా పనిచేస్తున్నారు. ఈయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

జ్యూట్ కార్మికుల బకాయి చెల్లింపునకు వినతి

ప్రజాశక్తి -తగరపువలస : కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జ్యూట్ కార్మికులకు పూర్తి స్థాయిలో బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు మిల్లులోని ఐఎన్‌టియుసి, ఎఐటియుసి ప్రతినిధులు శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్మికులకు బకాయిలను 2022 డిసెంబర్ 30లోగా చెల్లిస్తామని గతేడాది నవంబర్ 23న జెసిఎల్ వద్ద జరిగిన చర్చల సందర్భంగా హామీ ఇచ్చిన యాజమాన్యం నేటికీ అమలుచేయాలని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆయా సంఘాల ప్రతినిధులు ఎస్.అచ్చారావు, ఎవి.గురుమూర్తి, దల్లి అప్పలరెడ్డి, ఎం.ఆదినారాయణ, కె.ఈశ్వరరావు, అప్పలసూరి ఉన్నారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులుగా శ్రీనివాస్



ప్రజాశక్తి -తగరపువలస : జాతీయ చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులుగా తగరపువలస ప్రాంతానికి చెందిన గిడుతూరి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను వేదిక రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుషింగప్ప శుక్రవారం విడుదల చేశారు. చేనేత వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా ప్రయత్నం చేయాలని కోరారు. ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగే కార్య కలాపాలను నివేదిక రూపంలో రాష్ట్ర కేంద్రానికి పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు శ్రీను తెలిపారు. తన సేవలను గుర్తించి పదవి అప్పగించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-ఆనందపురం : వైఎస్ఆర్ కళ్యాణమస్తు కానుకలును అందించిన సందర్భంగా ఆనందపురం మండలం వేములవలస జంక్షన్‌లో గల వైఎస్ఆర్ విగ్రహం వద్ద వికలాంగుల విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు కోరాడ అప్పలస్వామి నాయుడు ఆధ్వర్యాన శుక్రవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవినీతికి తావు లేకుండా రాజకీయాలకతీతంగా పలు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. వివాహ కానుకగా వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా కింద నిధులు జమచేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నాయకులు రాంబాబు, పైడిరాజు, పైడితల్లమ్మ, టైలర్ల సంఘం అధ్యక్షుడు బోధ నారాయణపుడు, ఉపాధ్యక్షుడు ఎస్.అప్పలనాయుడు, సభ్యులు బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుంతీమాధవస్వామి సన్నిధిలో అంబికేశ్వరానందస్వామి

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలోని శ్రీఅనంతపద్మనాభస్వామి సన్నిధిలో ఉన్న కుంతీమాధవస్వామిని నెల్లూరుకు చెందిన శ్రీరాజరాజేశ్వరి పీఠాధిపతి యోగి అంబికేశ్వరానందస్వామి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు పవన్ స్వామిని స్వాగతించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవాలయం విశిష్టతను వివరించారు. అనంతరం యోగి అంబికేశ్వరానందస్వామి మాట్లాడుతూ, దేశ పర్యటనలో భాగంగా ఈ దేవాలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో ఎంపిపి, కంటుబోతు రాంబాబు, ఎర్రినాయుడు, పద్మ, అరుణ్‌కుమార్, టి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులతో సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని పందలపాక పంచాయతీ బాకురుపాలెం పంతులుగారు సర్పంచ్ దవళ నాగేశ్వరరావు కల్యాణ మండపంలో వైసిపి గృహసారథులతో సమావేశంలో నిర్వహించారు. భీమిలి నియోజకవర్గ వైసిపి పర్యవేక్షకులు పసుపులేటి బాలరాజు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వాలంటీర్లతోపాటు గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి వారికి వర్తించే పథకాలను అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బంక సత్యం, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకట్రావు, వైస్ ఎంపిపి పాండ్రింకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, మణిశంకర్ నాయుడు, పిన్నింటి వెంకటరమణ, బోని అప్పలనాయుడు, సర్పంచ్ దవళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను కోయంబత్తూరుకు చెందిన ఐఆర్ఎస్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి మోర భూపాల్‌రెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఎఇఒ నరసింహరాజు సాదర స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవాదాయ శాఖ అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-సింహాచలం: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన ఈవోలు, డిసిలు, ఇతర అధికారులకు దేవాదాయ శాఖ భూములు పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణా తరగతులు గోశాల వద్ద నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారి చంద్రకుమార్ పలు అంశాలను వివరించారు.

శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న శ్రీకన్యకాపరమేశ్వరీ దేవాలయం 6వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. 3 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎన్ సత్యకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్‌బాల్ విజేత ఆంధ్ర యూనివర్సిటీ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల టార్గెట్‌బాల్ పోటీల ఫైనల్స్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో గీతం విశ్వవిద్యాలయం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. దాదాపు దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి 29 జట్లు ఈ పోటీలలో పాల్గొనగా ప్రారంభం నుంచి ఆంధ్ర, గీతం విశ్వవిద్యాలయం జట్లు ప్రతిభ చాటుతూ వరస విజయాలతో ముందుకు సాగాయి. ఆంధ్రవిశ్వవిద్యాలయం జట్టు రాజస్థాన్‌కు చెందిన ఒపిజెఎస్ యూనివర్సిటీ జట్టు పై 34-8 స్కోరుతో విజయాన్ని నమోదు చేయగా, ద్వితీయ స్థానం కోసం జరిగిన పోటీలో గీతం జట్టు ఉత్తరప్రదేశ్‌కు చెందిన జిఎల్ఎ యూనివర్సిటీ జట్టుపై15-9 స్కోరుతో విజయం సాధించి రన్నరప్‌గా నిలిచింది. ఒపిజెఎస్ యూనివర్సిటీ తృతీయ స్థానంలో, జిఎల్ఎ యూనివర్సిటీ నాలుగవ స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆంధ్ర యూనివర్సిటీ క్రీడాకారుడు ఎమ్.ప్రణీత్ సుకుమార్ ఉత్తమ డైమండ్ క్రీడాకారుడుగా, గీతం క్రీడాకారుడు ఎస్.స్నేహిత్ ఉత్తమ షూటర్‌గా పతకాలను అందుకున్నారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ, గీతం ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, భారతీయ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సోనూశర్మ, గీతం క్రీడా విభాగం డైరెక్టర్ అరుణ్‌కార్తిక్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ హాజరై విజేతలను అభినందించారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్లను కాపాడుకోవాలి



తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి -మధురవాడ : అంతరించిపోతున్న అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లను కాపాడుకోవాలని, అందుకే అటవీశాఖ ఆధ్వర్యాన ఆర్‌కె.బీచ్, జోడుగుళ్లపాలెం, సాగరనగర్, చేపలుప్పాడ, పెదనాగమయ్య ప్రాంతాల్లో సంరక్షణ కేంద్రాలను ఏర్పాటుచేశామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రామనరేష్ తెలిపారు. సాగరనగర్‌లోని తాబేలు సంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. వేకువ జామున తాబేళ్ళు తీరంలో పెట్టిన గుడ్లను సేకరించి వాటిని ప్రత్యేకించి పొదిగించి మళ్ళీ సముద్రంలో విడిచిపెడతామని చెప్పారు. అటవీశాఖతో పాటు ప్రభుత్వరంగ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఈ అరుదైన తాబేళ్ళకు జీవం పోస్తున్నాయని తెలిపారు. ఇవి అంతరించి పోకుండా జిల్లా వ్యాప్తంగా వాలంటీర్లను నియమించి గుడ్లను సేకరించి ఇసుక తిన్నెల్లో సంరక్షిస్తున్నట్లు చెప్పారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేములవలస పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ మాట్లాడుతూ, తడి, పొడి చెత్తను వేరుచేసి తడి చెత్త ద్వారా వానపాముల ఎరువులుగా తయారు చేయాలన్నారు. పొడి చెత్తలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయాలని సూచించారు. వీటిపై అవగాహన పెంచుకొని చెత్త నుంచి సంపద కేంద్రాలను వృద్ధిలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ లవరాజు, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం అధికారి ఎన్‌విఎన్.మూర్తి, రీసెర్చ్ పర్సన్ నళిని, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

పోరాటాలతోనే హక్కుల సాధన

సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్

ప్రజాశక్తి -గాజువాక : పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు అన్నారు. క్లాప్ వెహికల్స్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం శుక్రవారం గాజువాకలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కెఎం.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. క్లాప్ వెహికల్ డ్రైవర్ల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటం తప్పదన్నారు. జీవీఎంసీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జి.సుబ్బారావు మాట్లాడుతూ, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాలని, ఎంఎస్ఎఫ్ డ్రైవర్ల వలే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి డిమాండ్‌చేశారు. పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ, పిఎఫ్, ఇఎస్ఐకి సంబంధించి కార్మికుల నుంచే రెండువైపులా డబ్బులు కట్ చేయడం సరికాదన్నారు. కాంట్రాక్టర్ వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపైనా జెసిఎల్‌కు నోటీసు ఇచ్చామని చెప్పారు. ఈ సమావేశంలో సిఐటియు గాజువాక నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జి.సుబ్బారావు

ఇళ్లు ఖాళీ చేయించొద్దంటూ వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి గోకాడ చెరువు, రాజచెరువు, ఏకలవ్య కాలనీ, దాడి అప్పారావు కాలనీలో నివాసముంటున్న వందల కుటుంబాలను ఖాళీ చేయించొద్దంటూ స్థానిక తహశీల్దార్‌కు మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు ఆధ్వర్యాన ఆయా కాలనీవాసులు వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇటీవల ఆయా కాలనీలను ఖాళీ చేయాలని నోటీసుల్విడంపై వారంతా తహశీల్దార్‌ను కలిసి ఆవేదనను వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా చినఅప్పలనాయుడు మాట్లాడుతూ, సుమారు 40 సంవత్సరాల నుంచి ఆయా కాలనీల్లో నివాసముంటున్న వారిని ఖాళీ చేయమంటే ఆర్థికంగా ఇబ్బంది పడతారని తెలిపారు. కలెక్టర్‌తో తహశీల్దార్ మాట్లాడి అవకాశమున్నంత వరకు ఆయా స్థలాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ప్రభుత్వ పరిధిలో పరిష్కరించకపోతే సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేస్తానని బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. రాజకీయాలకతీతంగా ప్రజా సమస్యలపై పోరాడుతూ, పేదలకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వేగి శ్రీనివాసరావు, ఎర్ర అప్పలరాజు, అప్పలనాయుడు, బొట్ట రవి, లాలం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

13న అప్రెంటిస్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : నరవలోని ప్రభుత్వ ఐటిఐ, కంచరపాలెంలోని ఓల్డ్ ఐటిఐలో ఈ నెల 13న 8వ ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు నరవ ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ బి.విజయలక్ష్మి తెలిపారు. ఐటిఐ నందు అన్ని ట్రేడ్లు పూర్తిచేసిన అభ్యర్థులు అప్రెంటిస్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. 20 జాతీయ స్థాయి కంపెనీలు అప్రెంటీస్ అవకాశం కల్పిస్తాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఆయా కేంద్రాలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9398785720 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి
పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు

దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానంపై పాలాభిషేకాలు

ప్రజాశక్తి- ములగాడ : నాయీ బ్రాహ్మణులకు దేవాలయాల్లో పాలకమండలి సభ్యులుగా సముచిత స్థానం కల్పించినందుకు మల్కాపురం బస్టాప్ వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం ఆ సంఘం నాయకులు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 610 దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులకు పాలకమండలి సభ్యులుగా స్థానం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పుల్లేటికుర్తి సూర్యారావు, అధ్యక్షులు గోల్కొండ రామకృష్ణ, సెక్రటరీ ఉప్పలపు లోవరాజు, వైస్ ప్రెసిడెంట్ సింహాచలం, ప్రచార కార్యదర్శి టెలిగ్రాఫ్ రాజు, అధికార ప్రతినిధి ఎల్ఎ.నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ తదితరు పాల్గొన్నారు.

బ్రదర్ అనిల్‌కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక : ఉడా కాలనీ వినాయక నగర్‌లో గీత కులాల యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఏకుల వెంకటేష్ కూడా ఆధ్వర్యాన శుక్రవారం బ్రదర్ అనీల్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరదేశి, జెర్రిపోతుల గోవిందరావు, నెల్లి సాధురావు, దేవాడ వరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న వెంకటేష్‌గౌడ్‌, ఎమ్మెల్యే నాగిరెడ్డి

తొలగించిన కార్మికున్ని విధుల్లోకి తీసుకోవాలి



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : తొలగించిన కార్మికుడిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో వడ్లపూడిలోని రైల్వే వేగన్ రిపేర్ వర్క్ షాపు వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ, కార్మికుడు అవతారం క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. 14 నెలల నుంచి పనిచేస్తున్న ఆయన స్కిల్ వర్కర్ జీతం ఇవ్వాలని అడిగినందుకు విధుల నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. యాజమాన్యం వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తక్షణమే విధుల్లోకి తీసుకోకపోతే సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటియు ఆటోనగర్, గాజువాక ప్రధాన కార్యదర్శులు డి.రమణ, ఎ.లోకేష్, యూనియన్ నాయకులు తాతారావు, అప్పారావు పాల్గొన్నారు.

13న ఇపిఎఫ్ పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి- ములగాడ : ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 13వ తేదీన పిఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు ఆ సంఘం మల్కాపురం నాయకులు కె.నూకరాజు తెలిపారు. మల్కాపురం వెంకన్నపాలెం సిఐటియు ఆఫీసులో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెన్షనర్ల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అతితక్కువ పెన్షన్‌తో కుటుంబాలను పోషించలేక అప్పులు పాలవుతున్నామన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలతో, జీవన పరిస్థితి దుర్భరంగా తయారైందని ఆవేదన వ్యకతంచేశారు. 2014 ఎన్నికల ముందు కనీస పెన్షన్ అంటూ బిజెపి వాగ్దానం చేసి తొమ్మిదేళ్లు గడిచినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. కనీస పెన్షన్ పెంచాలని ఒత్తిడి చేస్తే కమిటీలు వేయడం, హయ్యర్ పెన్షన్ అంటూ కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం చేస్తూ దుర్మార్గ వైఖరిని అవలంభిస్తోందని విమర్శించారు. ఈ సమస్యలపై ఈ నెల 13న చేపట్టే ధర్నాలో పెన్షనర్లు పాల్గొని జయప్రదం చేయాలని సంఘం నాయుకులు తమ్మారావు కోరారు. కనీసపెన్షన్ 9,000 చేయాలని, పెన్షన్‌కి డిఎ అనుసంధానం చేయాలని, అందరికీ హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని, భార్యాభర్తలకు మెడికల్ సదుపాయం కల్పించాలని డిమాండ్‌చేశారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నూకరాజు

ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అధ్యయనం

ఐఒసిఎల్ పరిశోధన విభాగం డైరెక్టర్ రామ్‌కుమార్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అధ్యయనం చేయాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్‌వి.రామ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఉదయం ఆయన ఏయూను వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన రామ్ కుమార్‌ను వర్సిటీ తరపున వీసీ ప్రసాదరెడ్డి సత్కరించారు. అనంతరం పాలకమండలి సమావేశ మందిరంలో ఏయూ అధికారులు, ఆచార్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ, ఇందన రంగానికి ఉపయుక్తంగా నిలిచే పరిశోధనలను తాము పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా ఐఒసిఎల్‌కు చెందిన ప్రత్యేక రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ చేపడుతున్న పరిశోధనలు, ఆవిష్కరణలను వివరించారు. త్వరలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న రీసెర్చ్ సెంటర్ తదితర అంశాలను వివరించారు. నెట్, గేట్ అర్హత సాధించిన పరిశోధకులకు తమతో కలసి పనిచేసే అవకాశం కల్పిస్తామన్నారు. బయోమాస్ నుంచి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, పెట్రోకెమికల్స్-పాలిమర్స్, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ తదితర రంగాలలో కలసి పనిచేయడానికి అవసరం ఉన్న అంశాలను వివరించారు. ఏయూ విద్యార్థులు, పరిశోధకులు నూతన ఆలోచనలతో వచ్చే తాము నిర్వహించే స్టార్టప్ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం అతిపెద్ద జ్ఞాన కేంద్రంగా నిలుస్తుందని, కలిసి పనిచేయాలని ఆహ్వానించారు.

ఉచిత దంత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మౌనిక, డాక్టర్ చార్మి, సిస్టర్ అన్వర్రీ, పిఆర్‌ఒ రమేష్, జేసుదాస్ తదితరులు వైద్యసేవలందించారు. 150 మందికిపైగా విద్యార్థులకు, ఉపాధ్యాకులకు ఉచిత దంత వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు మౌనిక, చార్మిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా సెక్రటరీ టి. తియోపిలస్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికీ దంత సమస్యలు వస్తున్నాయని, ఎప్పటికప్పుడు డాక్టర్ సలహాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా, వైస్ ప్రిన్సిపల్ బాల్బన్, ఎఒ రవిబాబు, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆఫీసర్లు మంజుల, అచ్చుమ్మ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆఫీసర్లు కమలా రాణి, నాగమణి, పాల్గొన్నారు.

గంగవరం పోర్టులో లోకో ట్రైన్

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టులో శుక్రవారం లోకో ట్రైన్‌ను ప్రవేశపెట్టారు. దీనివల్ల నౌకాశ్రయం నుంచి రేక్లే హ్యాండ్లింగ్ సామర్థ్యం పెంచుకోవడానికి మెరుగుపడుతుందని యాజమాన్యం తెలిపింది. ఈ నెల 600 రేక్‌లను నిర్వహించి నూతన రికార్డును సృష్టించినట్లు యాజమాన్యం తెలిపింది. లోకో ట్రైన్ ద్వారా మరింత సామర్థ్యం పెరుగుతుందన్నారు.

12న వెంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార టిపిటి కాలనీ ద్రావిడ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన శ్రీలలితా నూకాల కామేశ్వరి కల్యాణ మండపంలో ఈ నెల 12వ తేదీన వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు శృతిలయ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు యు.ప్రభాకర్ తెలిపారు. పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ, ఆ రోజు ఉదయం 10 గంటలకు సంకీర్తన వైభవం పేరుతో అన్నమాచార్య సంకీర్తన, మధ్యాహ్నం 3 గంటలకు సీతమ్మధారలోని త్రిమూర్తిక వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి తిరు వీధి, మంగళ ధ్వని సంకీర్తనలు, కోలాటం, ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పాణంగిపల్లి రంగనాధాచార్య బృందంచే శ్రీనివాస కల్యాణం, సంకీర్తనలతో పాటు ప్రముఖ సంగీత దర్శకుడు ఉదయ్ కుమార్ బృందంచే భక్తి గీతాలాపన, నవ చైతన్య కళా నాట్య మండలి సభ్యులచే శ్రీనివాస కల్యాణ నృత్య రూపకం ఉంటాయని వివరించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్రాలు, ప్రసాదాలు, స్వామి చిత్ర పటాలు అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంవి.రాజశేఖర్, కొణతాల రాజు, ఎస్.ఫణిస్వామి, మెలోడీ సత్యనారాయణ, ఎమ్మెస్ మాధవ్, మేడా మస్తాన్ రెడ్డి, చెన్నా తిరుమలరావు, ఎస్ఎన్ స్వామి పాల్గొన్నారు.

చెరువు భూమి మాయం

- రాజకీయ నాయకుల అండతో కబ్జా
- ఎల్‌పిసిలు సృష్టించుకున్న బడాబాబులు
- చోద్యం చూస్తున్న అధికారులు



చెరువు స్థలం ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

సాగునీటికి ప్రధాన వనరులైన, వరద నీరు ముంపు నుంచి కాపాడే చెరువు అధికారులు, స్థానిక రాజకీయ నాయకుల అండతో బడా బాబుల చేతిలో కబ్జాకు గురవుతోంది. ఆక్రమణదారులు ఎల్‌పిసిలు కూడా పొందినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సగానికి పైగా చెరువు కబ్జాకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

యలమంచిలి మున్సిపాలిటీ 20వ వార్డు పరిధి పెద్దపల్లిలో సర్వే నెంబర్ 286లో 12.49 ఎకరాలు చెరువు ఉండేది. విశాఖపట్నంకు చెందిన ఓ వ్యక్తి స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ఈ చెరువు భూమిలోని 3.79 ఎకరాలను దర్జాగా కబ్జా చేసి, ఆ భూమికి పత్రాలు కూడా సృష్టించుకున్నారు. దీనిపై గ్రామస్తులు కోర్టులో ఫిర్యాదు చేయడంతో ఆ భూమి చెరువు స్థలంగా సివిల్ కోర్టు నిర్ధారణ చేసింది. దీనిపై సదరు కబ్జాదారుడు హైకోర్టుకు వెళ్లారు.

ఈ ఆక్రమణను ఆసరాగా చేసుకొని గ్రామంలోని పలువురు బడాబాబులు మిగిలిన చెరువు భూమిలో సగం వరకు ఆక్రమించి, నిరుపేదలకు ఇచ్చే ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ (ఎల్‌పిసి)లను స్థానిక రాజకీయ నాయకులు, అధికారుల సహకారంతో పొందారు. వైసిపి టిడిపి అనే తేడా లేకుండా ఎవరికి అందినది వారు దర్జాగా కబ్జా చేసుకొని ఆక్రమించుకుంటూ పోతున్నారు. ఎల్‌పిసిలు నిజమైన నిరుపేదలకు ఇవ్వాలని, ఇక్కడ ఇళ్ల ఆక్రమణలు చేసిన వారు భూములు ఉన్న బడాబాబులని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆక్రమణలపై గ్రామంలో కొంతమంది యువకులు స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు.



కొత్తగా నిర్మాణం చేయడానికి సిద్ధం చేస్తున్న దృశ్యం

గ్రామంలో ఆక్రమణలపై 2022 డిసెంబర్ 31న 'యథేచ్ఛగా ఆక్రమణలు' శీర్షికన ప్రజాశక్తి కథనం ప్రచురించగా, స్పందించిన మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వచ్చి పరిశీలించారు. కాని అది ప్రభుత్వ భూమి అని ఎటువంటి బోర్డులు పెట్టలేదు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి మాట్లాడుతూ చెరువు భూమి కబ్జాపై రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం ఇచ్చామని, వారు సర్వే చేసి చెరువు భూమి ఎంతవరకు ఆక్రమణకు గురైందో గుర్తించి రిపోర్ట్ ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు సర్వే చేసి నెల రోజులు దాటినా రిపోర్ట్ ఇవ్వడంగాని, చర్యలు తీసుకోవడం గాని చేయకపోవడం గమనార్హం. అధికార పార్టీ అండతోనా? లేక అధికారులు మామూళ్ల మత్తులో మునిగి చాపకింద నీరులా సాగిస్తున్నారా? ఇవేమీ లేకపోతే చర్యలు ఎందుకు తీసుకోలేదు? అని పలువురు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కోట్ల రూపాయలు విలువ చేసే చెరువు భూమిని బడా బాబులు కబ్జా చేస్తే దానిని కాపాడాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం, తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు ఫోన్లో ఫిర్యాదు చేయగా, ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించినా పార్టీతో సంబంధం లేకుండా తొలగించేలా చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ చెరువు భూమిని స్వాధీనం చేసుకొని, అది ప్రభుత్వ స్థలంగా బోర్డులు పెట్టాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- అనకాపల్లి

మండలంలోని బగులవాడ పంచాయితీ శివారు ఆర్‌వి నగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపిపి గొర్లి సూరిబాబు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. పాఠశాల మౌలిక వసతులు గురించి ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో ఆహార కిట్లు అందరికీ అందుతున్నాయా లేదా, నాణ్యమైన పోషకాహారం అందుతుందా లేనిది గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. నాడు నేడులో భాగంగా ప్రతి పాఠశాలను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎండిఓ ధర్మారావు, బవులవాడ వైసిపి అధ్యక్షులు మజ్జి వెంకట అప్పారావు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

గర్భిణులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద గర్భిణులకు శుక్రవారం వైద్య సేవలు అందించారు. 30 మంది గర్భిణులను పరీక్షించగా అందులో ఐదుగురు గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించారు. వారిని కె.కోటపాడు సిహెచ్‌సికి తరలించినట్లు వైద్యాధికారులు ఎస్.లలిత, ఈ.పూజ్య మేఘన తెలిపారు. అనంతరం గర్భిణులను సమావేశపరిచి, వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులు కొట్టివేత

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజా సంఘాల నాయకులపై అక్రమంగా బనాయించిన కేసులను కోర్టు కొట్టివేసింది. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో 2016లో ఉపాధి హామీ పనులు నిలిపివేయడంతో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సత్యనారాయణ, డి వెంకన్న నాడు అధికారులను నిలదీశారు. దీంతో అప్పట్లో ఉపాధి హామీ అధికారులు వారిపై రెండు కేసులు బనాయించారు. ఎలమంచిలి కోర్టులో కేసులు విచారణ జరిగిన అనంతరం పోలీసులు, ఉపాధి హామీ సిబ్బంది పెట్టిన కేసులు రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి ఆ కేసులను కొట్టివేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెంకన్న తెలిపారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ విలీన గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగించాలని కోరారు.



కోర్టు నిర్దోషులుగా తేల్చిన సత్యనారాయణ, వెంకన్న



సరుకులు అందజేస్తున్న టిడిపి నాయకులు శంకర్ దంపతులు

ప్రేమ సమాజానికి బియ్యం, పప్పుల వితరణ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో బయ్యవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు తురిబిల్లి శంకర్ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా కొక్కిరాపల్లిలోని ప్రేమ సమాజానికి శుక్రవారం బియ్యం, పప్పులు అందజేశారు. వారం రోజులకు సరిపడే సరుకులు, పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపాలెం మాజీ సర్పంచ్ కర్రి దుర్గునాయుడు, టిడిపి కార్యకర్తలు ఉల్లింగల రమేష్, జెర్రిపోతుల నూక నాయుడు ద్వారపు రెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు

గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి -కశింకోట : కశింకోటలో గౌరీ పరమేశ్వరులు ఉత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం సారె ఊరేగింపు నిర్వహించారు. తినుబండారాలు, అరిటి గెలలు, వివిధ రకాల ఆకారంతో ప్రత్యేకంగా పంచదార చిలకలతో నిర్వహించిన సారె ఊరేగింపు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ఎస్‌ఐ ఆదినారాయణ రెడ్డి, మాజీ జెడ్పీటిసి మలసాల ధనమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పెంటకోట జ్యోతి, ఉత్సవ కమిటీ నాయకులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, బొడ్డేడ బాలాజీ, పెంటకోట తాతారావు, ఆడారి నరిశింగరావు, దాడి నాగరాజు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న ఎస్‌ఐ, మాజీ జెడ్పిటిసి తదితరులు

తాడి గ్రామాన్ని తరలించాలని నిరసన



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు, తాడి గ్రామస్తులు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని ఫార్మాసిటీ పక్కనే ఉన్న తాడి గ్రామాన్ని తక్షణమే తరలించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ గ్రామంలో ర్యాలీ, నిరసన చేపట్టారు. తాడి గ్రామాన్ని తరలించాలి, కాలుష్యం బారి నుండి కాపాడండి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 15 రోజుల్లో గ్రామాన్ని తరలిస్తారని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, గ్రామాన్ని తరలించే వరకు నిద్రపోనని ప్రకటించిన స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజు నెలలు గడుస్తున్నా తరలింపునకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. తాడి గ్రామ ప్రజల ప్రశ్నిస్తారని, నిలదీస్తారని భయపడిన ఎమ్మెల్యే ఈ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించకుండా ప్రజలకు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. గ్రామంలో ప్రజలు మంచినీటిని కొనుక్కొని తాగుతున్నారని, మంచి గాలికి నోచుకోవడం లేదని, చర్మ, కిడ్నీ, ఊపిరితిత్తులు వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ బెల్ట్ బఫర్ జోన్ భూములను అమ్ముకున్న వైసిపికి చెందిన రాంకీ కంపెనీకి అధికార పార్టీ నేతలు అండగా నిలుస్తున్నారని తెలిపారు. గ్రామాన్ని తరలించడానికి జీవో ఇవ్వని ప్రభుత్వం రాంకీకి, రాంకీ ల్యాండ్ ఫీల్డ్‌కి 50 ఎకరాలు కేటాయిస్తూ జీవో ఇవ్వడం దారుణమన్నారు. తక్షణమే తాడి గ్రామాన్ని తరలించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకుంటే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి అప్పారావు, కె మాధవరావు, ఎన్ లక్ష్మి, కె త్రినాథ్, బి రమణ, జి సోమేష్, కె రామలక్ష్మి, కె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని కొండ గోకిరిలో నిర్వహిస్తున్న లోకల గాంధీ వాలీబాల్ టోర్నమెంట్ రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. ఈ టోర్నమెంట్‌ను చూడడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. గోకిరి గ్రామమంతా పండగ వాతావరణం ఏర్పడింది. ఈ నెల 16వ తేదీ వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు స్వామి, రాజేష్, దిలీప్, లవకుశ, లోకేష్ పాల్గొన్నారు.

యాంత్రీకరణతో చెరుకు రైతుకు లాభం

ఆర్ఎఆర్ఎస్ ఎడిఆర్ జగన్నాథరావు



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

యాంత్రీకరణ చెరుకు రైతుకు లాభసాటి కానుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్ డాక్టర్ పివికె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఎఆర్ఎస్‌లో శుక్రవారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లాలో అనకాపల్లి బెల్లం మార్కెట్, సుగర్ ఫ్యాక్టరీలు ఉండడంతో గతంలో గణనీయంగా చెరుకు సాగు విస్తీర్ణం జరిగేదని గుర్తు చేశారు. నేడు ఉత్పత్తి ఖర్చులు పెరగడం, మద్దతు ధర లేకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు మాట్లాడుతూ రబీ సీజన్లో రైతులు అపరాలు, పొద్దు తిరుగుడు, నువ్వులు, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలు వేయడం ద్వారా లాభసాటి ఉంటుందని చెప్పారు. విశాఖ జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి మాట్లాడుతూ రబీ సీజన్లో పెద్ద ఎత్తున పొలంబడి కార్యక్రమం నిర్వహించడం ద్వారా వ్యవసాయ పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించవచ్చని తెలిపారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంపై వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు, వివిధ డివిజన్ల వ్యవసాయ అధికారులు, ఆర్ఎఆర్ఎస్ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

రంగులు, ఫొటోల పిచ్చితో ప్రజాధనం దుర్వినియోగం

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రంగులు, ఫొటోల పిచ్చితో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రంగుల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేయడం దారుణమన్నారు. దీనిపై కోర్టులో ప్రజా వ్యాజ్యం వేయడంతో హైకోర్టు, సుప్రీంకోర్టు ప్రభుత్వానికి మొట్టి కాయలు వేశాయని గుర్తు చేశారు. బిసి సర్టిఫికెట్లు, పాస్ పుస్తకాలు, సర్వే రాళ్లపై జగన్ రెడ్డి బొమ్మలు వేయించి కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ప్రతి ఇంటికి నువ్వే మా నమ్మకం అనే స్టిక్కర్లను గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పంపిణీ చేయాలని జీవో జారీ చేయడం చూస్తే ఎంత ఫొటోల పిచ్చి ఉందో అర్థమవుతుందన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి సూరే సతీష్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు నడిపల్లి గణేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అప్పారావు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పాటించాలి

ప్రజాశక్తి- కశింకోట

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో పాటించాలని ఎంపిడిఒ కొంకి అప్పారావు అన్నారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ కార్యాలయాలలోనూ సచివాలయాలలోనూ రాజకీయ నాయకుల, ప్రజా ప్రతినిధుల బోర్డులను తొలగించాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల రిజిస్ట్రేషన్, చెరువుల అభివృద్ధి గురించి సమీక్ష నిర్వహించారు·

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి

పర్యావరణ పరిరక్షణ, ఆత్మరక్షణ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డైట్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తెలిపారు. డైట్ కళాశాల దత్తత గ్రామం అక్కిరెడ్డిపాలెంలో శుక్రవారం ఆత్మరక్షణ సాంకేతిక పరిజ్ఞానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల వచ్చే అనర్థాలు, పరిశుభ్రత, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

జెట్టీ నిర్మాణం చేపట్టాలి

103 రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ప్రజాశక్తి -రాంబిల్లి

ఎన్ఎఒబి నిర్వాసిత మత్స్యకారుల చేపల వేటకు అనుకూలంగా తక్షణమే జెట్టీ నిర్మాణం చేయాలని నిర్వాసిత జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. నేవల్ బేస్ నిర్వాసితులు మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ ప్రధాన గేట్ ముందు నిర్వహిస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి 103వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ కొత్తపట్నం వాడ నరసాపురం మత్స్యకారులకు జెట్టీ నిర్మిస్తామని చెప్పి నేడు కట్టకుండా మోసం దారుణమన్నారు. మత్స్యకారులకు జెట్టీ లాంటి ప్రాంతమైన శారద, వరాహ నదులను నేవీ తీసుకొని తమ బోట్లు తీసేయాలని, నేవీ లోపలకు చేపలవేటకు రాకూడదని అంటే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. చేపల వేటకు ఆటంకం కల్పించి, మా జీవన భృతిని లాక్కున్న నేవీ అధికారులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మా జీవితాలు కోసం ఆలోచన చేయడం మీ బాధ్యత కాదా అని ప్రశ్నించారు. నేవీ నిర్మాణానికి 4800 ఎకరాల భూములు త్యాగం చేసిన రైతుల సమస్యలు పట్టించుకోవడం జిల్లా అధికారులు, ప్రభుత్వాల బాధ్యత కాదా? అని ప్రశ్నించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఎన్ని రోజులైనా ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని తేల్చి చెప్పారు. దేశ రక్షణ కోసం తాము త్యాగం చేస్తే, మా జీవితాల కోసం ఆలోచన చేయకపోవడం మీకు తగునా అని నిర్వాసితులు ప్రశ్నించారు.

పిహెచ్‌సిల భవనాలకు రూ.7.44 కోట్లు మంజూరు

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు

ప్రజాశక్తి- దేవరాపల్లి

రాష్ట్రంలో మూడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం కోసం రూ.7.44 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంజూరు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గురువారం రాత్రి ఆయన స్థానిక విలేకరులకు ఈ విషయం వెల్లడించారు. నాడు -నేడు పథకం కింద ఈ నిధులు మంజూరు చేసి, జిఓ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి రూ.1.70 కోట్లు, అన్నమయ్య జిల్లా తంబాలపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి రూ.2.76 కోట్లు, గుంటూరు జిల్లా పెదనందిపాడు పీహెచ్‌సీకి రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. నూతన భవనాల నిర్మాణం త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. తన విజ్ఞప్తి మేరకు దేవరాపల్లి పీహెచ్‌సీ అదనపు భవనానికి నిధులు మంజూరు చేసిన సీఎం జగన్మోహన్ రెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజినికి, ప్రభుత్వ ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎంటి కృష్ణ బాబుకు బూడి కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

నేడు ఎస్‌సి, ఎస్‌టి గెజిటెడ్ అధికారుల రాష్ట్ర సదస్సు



ప్రజాశక్తి- కె.కోటపాడు

ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల రాష్ట్ర సదస్సు శనివారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, స్థానిక సబ్ రిజిస్టర్ బంగారి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులందరూ హాజరవుతున్నట్లు వెల్లడించారు. రెగ్యులర్, టీచింగ్, నాన్ టీచింగ్, కాంట్రాక్ట్ , మినిమం టైం స్కేల్, పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి అనంతరం గోదావరి డెల్టాకు నీరు విడుదల

ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్

ప్రజాశక్తి -సీలేరు



సీలేరు కాంప్లెక్స్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు మాత్రమే గోదావరి డెల్టాకు వెళ్తుందని ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ వెల్లడించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 1 నుంచి 8వ తేదీ వరకు డొంకరాయి జలాశయం నుంచి 0.979 టీఎంసీలు నీటిని విడుదల చేశామని తెలిపారు. ఈ ఏడాది బలిమెల జలాశయంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో గోదావరి డెల్టాకు విద్యుత్ ఉత్పత్తి తరువాతనే నీటిని విడుదల చేయాలని ఏపీ జెన్కో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. ఈ మేరకు డొంకరాయి నుంచి నేరుగా గోదావరి డెల్టాకు 1700 క్యూసెక్కులు చొప్పున నీటిని ఈనెల 8 వరకు విడుదల అనంతరం నీటి విడుదల నిలిపివేశామని వెల్లడించారు. ప్రస్తుతం పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 3750 క్యూసెక్కులు నీరు మాత్రమే విడుదల అవుతుందన్నారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ప్రస్తుతం మన వాటా బలిమెల జలాశయంలో నీటిని కలుపుకొని 35 టీఎంసీలు నీరు ఉందని, ఈ నీటినే చివరి వరకు తాగునీటికి, విద్యుత్ ఉత్పత్తికి పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో రోజుకి 6 నుంచి 7 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం కాంప్లెక్స్ పరిధిలోని మాచ్‌ఖండ్, సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 జనవరి 31 నాటికి 1810 మిలియన్ యూనిట్లు టార్గెట్ గాక 1710 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరిగిందని తెలిపారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో 1, 4, 6 యూనిట్లు ఆర్ఎల్ఎ స్టడీ జరుగుతున్నందున లక్ష్యాన్ని చేరుకోలేకపోయామని శ్రీధర్ వెల్లడించారు.


55వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి- కంచరపాలెం : జివిఎంసి 55వ వార్డు పరిధి ధర్మానగర్ ప్రాంతంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కెవిఎన్.శశికళతో కలిసి పర్యటించారు. ముందుగా ధర్మానగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, వార్డు వైసిపి అధ్యక్షులు కెపి రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, నూకరాజు, రాయుడు శ్రీను, ఎర్రంశెట్టి శ్రీనివాస్, సొండి సురేష్, కరుణ, లక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి -కొత్తకోట: రాష్ట్ర అభివృద్ధికి ముఖ్య మంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. రావికమతం, రోలుగుంట మండలాలలో ఇటీవల ఎన్నికైన సచివాలయం కన్వీనర్లు, గృహ సారదులకు శుక్రవారం స్థానిక రవి థియేటర్‌లో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హత కలిగిన వారందరికి అందేలా చొరవ చూపాలని సూచించారు. మరో మారు వైసీపీ ప్రభుత్వం గెలిచేలా అంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రావికమతం ఎంపిపి పైల రాజు, వైస్ ఎంపిపి దంట్ల వెంకట రమణ, ఎం.భవాని ప్రసాద్, జి. సత్యదేవ్, గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, మండల సచివాలయ కమిటి కన్వీనర్ కె.జగ్గారావు, రావికమతం, రోలుగుంట మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ



గీతాలు ఆలపిస్తున్న బృందం సభ్యులు

ఆకట్టుకున్న భజన గీతాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం ఉదయం ఏకాహం (భజన) కార్యక్రమం అలరించింది. దుర్గాదేవి ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవంలో భాగంగా శ్రీనివాస భక్త సమాజం ఆధ్వర్యంలో 24 గంటల పాటు ఏకాహం భజన కార్యక్రమం చేపట్టారు. శనివారం ఉదయం 6 గంటలకు ఏకాహం ముగుస్తుంది. భజన సమాజ బృందాలు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి లచ్చబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

15 వరకూ ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి -మాకవరపాలెం: ఈ నెల 15వ తేదీ వరకే ధాన్యం కోనుగోలు చేపడుతున్నట్లు వ్యవసాయ అధికారి చిరంజీవి తెలిపారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, మండలంలో ఇంత వరకు 650 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఈ నెల చివరి నాటికి ధాన్యం కోనుగోలు చేసిన రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు రైతులు రైతు భరోసా కేంద్రాలు సిబ్బందికి తెలియజేయాలన్నారు.

రోలుగుంట: మండలంలో రైతులు ఈనెల 15వ తేదీలోపు ఆర్‌బికెల్లో అమ్మకాలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి విజయకుమారి తెలిపారు. త్వరగా కుప్పలు నూర్చుకుంటే ధాన్యంను ఆర్‌బికే కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

ఘనంగా అడవి రాజులబాబు పండగ

ప్రజాశక్తి- కోటవురట్ల: మండల వ్యాప్తంగా శుక్రవారం పలు గ్రామాల్లో అడవి రాజుల బాబు పండుగ సంబరాలు అత్యంత ఘనంగా జరిగాయి. పాములవాక గ్రామంలో వైసీపీ మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పసుపు, కుంకుమ సమర్పించారు. కోలాటం, తప్పిడ గుళ్ళు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వెంకటాపురం, చిన్న బొడ్డేపల్లి, కైలాసపట్నం తదితర గ్రామాల్లో పండుగ సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది.

మాకవరపాలెం: మండలంలో పలు గ్రామాల్లో ఆడివి రాజులబాబు పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాచపల్లి, కొండలఅగ్రహారం, దాలిం పేట గ్రామాల్లో ఆడివి రాజులబాబు పండగను ప్రజలంతా వైభవంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఆలయాలకు చేరుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాకవరపాలెంలో పండుగను చేస్తున్న ప్రజలు

గొలుగొండ: మండలంలో శుక్రవారం పలు గ్రామాల్లో అడవిరాజుల బాబు పండుగలు ఘనంగా నిర్వహించారు. మండలంలో లింగంపేట, చోద్యం, రామచంద్రపురం, గైరంపేట గ్రామాల్లో ప్రజలు అడవి రాజులబాబుకు పూజలు చేశారు. ఉదయాన్నే భక్తులంతా ఆయా గ్రామాల్లో దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గృహాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: గృహ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. మండలంలోని ఉపమాక గ్రామంలో శుక్రవారం జగనన్న లేఅవుట్ ను హౌసింగ్ ఏఈ రాజుతో కలిసి సందర్శించారు. నిర్మాణ దశలో ఉన్న గృహాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. అధికారుల ఆదేశాల మేరకు త్వరితగతిన గృహ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఇంకా గృహ నిర్మాణ పనులను ప్రారంభించని లబ్ధిదారులు వెంటనే చేపట్టాలన్నారు. పేమెంట్లకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ఇన్స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేపడుతున్న సర్పంచ్, నాయకులు

మరిడమ్మ ఆలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని కొంగసింగి గ్రామంలో మరిడమ్మ తల్లి ఆలయానికి శుక్రవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ కేటాయించిన ప్రత్యేక నిధులతో ఈ ఆలయ నిర్మాణాన్ని ప్రారంభిస్తు న్నారన్నారు. ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, వైసిపి నాయకులు కసవరాజు, సత్తిబాబు, బాబురావు, టిడిపి నాయకులు యలమంచిలి వరహాలబాబు, మాజీ ఎంపిటిసి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని జోగంపేటలో గౌరీ పరమేశ్వరులు ఉత్సవాలు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్నారు. జోగంపేట జంక్షన్ నుంచి పాతజోగంపేట మెయిన్ రోడ్ ఇరువైపులా భారీ విద్యుత్ దీపాలతో అలంకరణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

జై మోదకొండమ్మ సినిమా చిత్రీకరణ



చిత్రీకరిస్తున యూనిట్ సభ్యులు

ప్రజాశక్తి -మాడుగుల: మండల కేంద్రంలో ఉబ్బలింగ స్వామి దేవాలయం వద్ద జై మోదకొండమ్మ సినిమా చిత్రీకరణ శరే వేగంగా జరుగుతుంది. కొద్దికాలంగా ఈ ప్రాంతంలో సినిమా షూటింగ్ సాగుతోంది. పోలాకి శివ దర్శకత్వంలో ప్రేమ, బాహుబలి ప్రభాకర్, సత్య ప్రకాష్, శివకృష్ణ తదితరులు ఈ చిత్రంలో నటిస్తుండగా శుక్రవారం ప్రేమ, బాహుబలి ప్రభాకర్‌ల సన్నివేశాలు చిత్రీకరించారు. దీనికి సంబంధించి దేవాలయం పరిసర ప్రాంతంలో విలేజ్ సెట్టు వేసి చిత్రీకరించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కేన్సర్ బాధితునికి సాయం

ప్రజాశక్తి -యస్.రాయవరం: మండలంలోని గుడివాడ పంచాయతీ శివారు కొత్త పోలవరంలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న నమ్మి గణేష్‌కు స్పందన చేయూత ఫౌండేషన్ ఆర్థికసాయం అందజేసింది. ఈ వ్యాధితో బాధపడుతున్న గణేష్ వ్యవసాయ కూలీ కావడంతో విషయం తెలుసుకున్న స్పందన చేయూత పౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం ఉదయం ఆరోగ్య రక్ష కింద రూ.5000, గుడివాడ మాజీ సర్పంచ్ నల్లపురాజు వెంకటపతి రాజు రూ.5000 మొత్తం పది వేల రూపాయలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎన్ వెంకటపతి రాజు, వైద్యులు అనిల్ వర్మ, రాము పాల్గొన్నారు.



నగదును ఇస్తున్న స్పందన సంస్థ ప్రతినిధులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు

శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -పాయకరావుపేట: పాయకరావుపేట జిల్లా పరిషత్ అతిధి గృహం వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుంటూరు శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బీసీ నాయకులు, లెదర్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లను నాయకులు, కార్యకర్తలు పంచుతూ పట్నంలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నెలపర్తి అర్జునరావు, డొక్కుమల్ల చిన్న, వీరబాబు, నామవరం పిఎసిఎస్ చైర్పర్సన్ సుందర్ లత, వార్డ్ మెంబర్ పల్ల ప్రసాద్, తూము రమణ, వెంకటరమణ, ఆటో యూనియన్ అధ్యక్షులు ఈశ్వరరావు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నేతల ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో కోడ్ అమల్లోకి వచ్చిందని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. నక్కపల్లిలో శుక్రవారం ఈ ఓపిఆర్‌డి వెంకటనారాయణతో కలిసి పర్యటించారు. రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బందితో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 32 పంచాయతీ గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను తొలగింపునకు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రాజకీయ పార్టీల నాయకులు సహకరించి ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలు ఉల్లంఘించ కూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

ముడసర్లోవ భూములపై తీర్మానాన్ని రద్దు చేయాలి

-మూడో రోజు పాదయాత్రలో సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ పార్కు, రిజర్వాయర్‌కు చెందిన 283 ఎకరాల స్థలాలను పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయాలని జీవీఎంసీ పాలకవర్గం చేసిన తీర్మానాన్ని వెంటనే రద్దుచేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ముడసర్లోవ భూముల రక్షణకు మూడు రోజులుగా జరుగుతున్న పాదయాత్ర శుక్రవారం జివిఎంసి 10వ వార్డు పరిధి పాత డెయిరీ ఫారం సెంటర్ నుంచి ప్రారంభమై ఆదర్శనగర్, సుందర్ నగర్, వివేకానందనగర్ మీదుగా రవీంద్రనగర్ చివర బస్టాప్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, జీవీఎంసీ సొంత నిధులతో ముడసర్లోవ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. పిపిపి అంటే ప్రయివేటుకు దారాధత్తం చేయడమేనని పేర్కొన్నారు. గతంలో డెయిరీ ఫామ్ ప్రాంతంలో గుర్రపు పందేలు నిర్వహించే సెంటర్ ఉండేదని, దానివల్ల యువకులు పెద్ద ఎత్తున జూదానికి బానిసై ఆస్తులను పోగొట్టుకుంటుండటంతో, దాన్ని తొలగించడం కోసం ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడాయన్నారు. అదే ఐకమత్యంతో ముడసర్లోవ భూము లను రక్షించుకోవడానికి అందరూ ఏకతాటిపైకి రావాలని విజ్ఞప్తి చేశారు. ముడసర్లోవ భూములు ప్రయివేటుపరమైతే ఆరిలోవ ప్రజలకు తాగు నీరు సమస్య ఏర్పడుతుందని, పార్కులో అడుగు పెట్టాలంటేనే ఫీజులు వసూలు చేస్తారని తెలిపారు. క్యాసినో క్లబ్బులు, పబ్బులు ఏర్పాటు వల్ల యువత పాడైపోతారని పేర్కొ న్నారు. ఈ ప్రాంతానికి చెందిన మేయర్ గారూ ఈ భూములు అమ్మొద్దు.. రక్షించండి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆరిలోవ జోన్ నాయకులు వి.నరేంద్రకుమార్, పి.శంకరరావు, రమణ, నాగరాజు, ఐసి.నాయుడు, భూలోకరావు, తులసీరామ్, కుమారి, సన్యాసమ్మ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పాదయాత్రలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్


పాల్గొన్న క్రీడాకారులు

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని సింగరాజుపేట యూత్ ఆధ్వర్యంలో వీర గంగాలమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి సంవత్సరం గంగాలమ్మ తల్లి జాతర మహోత్సవ సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తామని, మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహుమతి రూ.5వేలు అందించనున్నామన్నారు. టోర్నమెంట్లో సుమారు 8 టీములు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో సింగరాజుపేట యూత్ మెంబర్స్, క్రీడాకారులు పెద్దలు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో
బాలల హక్కుల కమిషన్ పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 13, 14 అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం, ఆదిలక్ష్మి, త్రిపర్ణలు పర్యటించనున్నారని కమిషన్ కార్యదర్శి టి.వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

12న మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర సమావేశం

ప్రజాశక్తి- కలెక్టరేట్:మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర సమావేశం ఈనెల 12న ఆదివారం విశాఖ నగరంలోని విశాలాక్షి నగర్ బివికె స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిమళ్ల వాసు తెలిపారు.శుక్రవారం సాయంత్రం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు 1500 మంది మత్స్యకార ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో అఖిలభారత సీమ సురక్ష సహప్రముఖ జి. మురళీధర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి, తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలపై తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు.విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు, గ్రంథాలయం వంటి అంశాలపై తమ సంస్థ పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఉమ్మిడి మహేష్, సున్నపు తిరుపతిరావు, వావిల బాబు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై సిపిఐ నిరసన


విశాఖలో ర్యాలీ చేపడుతున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- కలెక్టరేట్: కేంద్ర బడ్జెట్‌లో ఎపికి తీవ్ర అన్యాయం జరిగిందని, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు, విశాఖ రైల్వే జోన్‌కి నిధుల కేటాయింపు దారుణంగా ఉందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి సత్యనారాయణమూర్తి విమర్శించారు. అదాని అక్రమ సంపాదనపై సమగ్ర దర్యాప్తు చేసి ఆస్తులు జప్తు చేయాలని శుక్రవారం రైల్వే డివిజనల్ కార్యాలయం (డిఆర్‌ఎం) వద్ద సిపిఐ నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. మోడీ మొదటిసారి అధికారం చేపట్టిన సమయంలో దేశ సంపన్న వర్గాల్లో 630 స్థానంలో ఉన్న అదాని గడిసిన 5 ఏళ్ల వ్యవధిలో మొదటి స్థానంలో నిలిచాడన్నారు. మోడీ సర్కార్ ప్రోత్సాహం ఎంతగా ఉందో అర్థమవు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్.కె రెహమాన్, పి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గొలుగొండ:కేంద్ర ప్రభుత్వం అండతో దేశ సంపదను కొల్లగొడుతున్న అదాని ఆస్తులను తక్షణమే జప్తు చేసి జాతీయం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నేతలు మండలంలోని కృష్ణదేవిపేటలో అంబేద్కర్ సెంటర్ నుండి ర్యాలీగా వెళ్లి ఎస్‌బిఐ బ్యాంకు వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ,కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎంపిలు నరేంద్ర మోడీకి భజన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను తాకట్టు పనిలో నరేంద్ర మోడీ ఉన్నారని, ముఖ్యమంత్రి జగన్, ప్రతిపక్ష పార్టీ నేత చంద్రబాబు మౌనం వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు మేకా సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు జి.రాధాకృష్ణ, ఎల్.బాబులు, జి.సత్యనారాయణ, ఎం.శ్రీరామ్మూర్తి, అప్పలనాయుడు, కె.రాంబాబు, వాసుదేవరావు, పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఐ భీమిలి ఏరియా సమితి ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక పోస్టాఫీసు వద్ద నిరసన తెలిపారు. ప్రధాని మోడీ డౌన్ డౌన్, అదాని ఆస్తులన్నీ జప్తు చేయాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అల్లు బాబూరావు, సహాయ కార్యదర్శి కానూరి రాంబాబు, మాజీ కౌన్సిలర్లు సిహెచ్.నరసింహులు, టి సోమరాజు, నాయకులు ఎం వీర్రాజు, సిహెచ్.అప్పారావు, జి.సూరిబాబు పాల్గొన్నారు.

అనకాపల్లి: సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ముందు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, నాయకులు రాజాన దొరబాబు, కే సన్యాసిరావు, వైఎస్ భద్రం, రాజువాన లక్ష్మణ, చెల్లూరి నాగరాజు, నాయుడు మల్లికార్జునరావు, టి వెంకటేశ్వర్లు, సత్యారావు, శ్రీరామదాసు అబ్బులు పాల్గొన్నారు.

చక్కెర కర్మాగారాల మూతతో..
తరలిపోతున్న చెరుకు

ప్రజాశక్తి -కోటవురట్ల:నియోజకవర్గంలో ఏటికొప్పాక చక్కెర కర్మాగారం గడిచిన రెండు సంవత్సరాలుగా మూతపడటంతో ఏటికొప్పాక పరిధిలోని రైతులు పండించిన చెరుకును గత్యంతరం లేక ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు.గతంలో తాండవ చక్కెర కర్మాగారానికి ఈ ప్రాంతం నుంచి చెరుకు తరలించేవారు. తాండవ చక్కెర కర్మాగారం కూడా మూతపడటంతో ప్రస్తుతం ఇక్కడ పండిన చెరకు పంటను తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోని పరిసర ప్రాంతాలలో చక్కెర, బెల్లం కర్మాగారాలకు తరలి స్తున్నారు. గత్యంతరం లేక తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. కైలాసపట్నం వద్ద ఏర్పాటు చేసిన తూనిక కేంద్రం వద్దకు కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం, గొలుగొండ తదితర మండలాల నుండి రైతులు వ్యయప్రయాసలకు ఓర్చి చెరకు తీసుకొచ్చి అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.గతంలో ఏటికొప్పాక సహకార చక్కర కర్మాగారం ఉన్నప్పుడు రైతులకు కాస్త సహకారంగా ఉండేది, ముందస్తు పెట్టుబడి అదే విధంగా రవాణా చార్జీలు, ఎరువులు సరఫరా చేసేవారు. ప్రస్తుతం సహకార చక్కెర కర్మాగారం మూత పడటంతో రైతులు పండించిన పంటను దళారులకు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుంది.చెరుకుకు సొమ్ము వెంటనే చెల్లించక పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చక్కర కర్మాకారాలకు పూర్వ వైభవం తీసుకొస్తానని ఆనాడు చేపట్టిన పాదయాత్రలో సిఎం జగన్మోహన్ రెడ్డి వాగ్దానం చేసి గాలికి వది లేశారని పలువురు విమర్శిస్తున్నారు. హామీ ఇచ్చి మరచి పోవడం తగదన్నారు. దాదాపు 5000 మంది సభ్యులు ఉన్న కొప్పాక సహకార చక్కెర కర్మాగారం రైతులు దిక్కుతోచని స్థితిలో దిక్కులు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చక్కెర కర్మాగారాలకు పూర్వ వైభవం తీసుకువచ్చి మూతపడిన ఫ్యాక్టరీలను పున: ప్రారంభం చేపట్టి ఆదుకోవాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుతున్నారు.


కొడవడిపూడిలో వృథాగా ఉన్న చెరుకు కాటా


లారీల్లో ఇతర జిల్లాలకు తరలిస్తున్న చెరుకు